క్లుప్తంగా

మార్టేరులో చలివేంద్రం ప్రారంభం


మార్టేరు సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి

పెనుమంట్ర: మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి ప్రారంభించారు. వేసవిలో మార్టేరు సెంటర్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక దాతల సహకారంతో మే నెలాఖరు వరకు ఈ చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు కోనాల కోదండ రామ చంద్ర శేఖరరెడ్డి (ఆచారి) తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, వెలగల సోమిరెడ్డి, మల్లీడి మీరారెడ్డి, కాయల సత్యనారాయణరెడ్డి, చింతా ధర్మారెడ్డి, పాంగ్రీ శ్రీను, ఎస్.రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన


మంగళగుంటపాలెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆరోగ్యకరమైన సమాజం కోసం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం మంచిదని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీనా, మహిళాపోలీస్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామ పరిధిలోని మంగళగుంటపాలెం ప్రాథమిక పాఠశాలవద్ద గురువారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బేబి నిర్మల పాల్గొని పోషక విలువలు కలిగిన రాగులు, సజ్జలు, అరికలు, సామలు, తదితర వాటిని గురించి వివరించారు. గర్భిణులు, చిన్నారులు, యుక్త వయస్సు పిల్లలకు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

కోలాటం గురువుకు సత్కారం


శివదేవునిచిక్కాలలో కోలాటం గురువు చిన్నాను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సంస్కృతి, సంప్రదాయాలను కళా రూపాల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ భావి తరాలకు పునాదులు వేస్తున్న కోలాటం గురువు చిన్నా అభినందనీయులని ఆధ్యాత్మిక గురువు, సొసైటీ అధ్యక్షుడు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి) అన్నారు. స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శెట్టిబలిజ రామాలయం వద్ద నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా తిరుమల తిరుమతి దేవస్థానం ప్రోత్సాహంతో పాలకోడేరు గ్రామానికి చెందిన హరే శ్రీనివాస కోలాటం గ్రూపు వారితో కోలాటం నిర్వహించారు. స్థానిక పెద్దల ఆధ్వర్యంలో శ్రీ సీతా రాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ దిడ్ల మణివజ్రం, స్పందన వాకర్ల క్లబ్ అధ్యక్షురాలు ర్యాలి శుభ, సభ్యులు సన్నిధిరాజు సుసారిక, మంచిగంటి వరలక్ష్మి, నక్కా సుభాషిణి, ఆముదాల వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు ర్యాలి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నేటితో ముగుస్తున్న వడ్డీ రాయితీ గడువు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిదారులు శుక్రవారం సాయంత్రం 5 గంటలు లోపుగా కడితేనే వడ్డీ రాయితీ వస్తుందని మున్సిపల్ ఆర్ఐ కె.నానాజీ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి బకాయిలు చెల్లించిన వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు. పన్ను బకాయిలు మీ-సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, సచివాలయాల్లో చెల్లించవచ్చని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పంట కాలువలో మృతదేహం లభ్యం

ఉండి: మండలంలోని కలిసిపూడి పంటకాలువలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు ఓ యువకుడి మృతదేహాన్ని పంటకాలువ నుంచి వెలికితీసి భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 16 ఏళ్లు ఉండవచ్చునని సమాచారం. అయితే దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దీనిపై తాము కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

గ్రామాల్లో రాములోరి కల్యాణ సందడి

- వాడవాడలా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- రామాలయాల వద్ద పానకాలు పంపిణీ చేసిన నిర్వాహకులు


నరసాపురంలో సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


సలాదివారి తోట రామాలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


గోరింటాడలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని వాడవాడలా కొలువై ఉన్న రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక బుధవారపు వీధి రామాలయంలో, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో, ముచ్చర్లవారి వీధి, మన్యం జగ్గమ్మ సత్రం, మెయిన్‌రోడ్డు శ్రీ క్షీరారామ సువర్ణ వర్తక సంఘం ఆధ్వర్యంలో, పినిశెట్టి వారి వీధి, బ్రాడీపేట శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో, కోడిగట్టు శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయం, వెలమగూడెం, బ్రాడీపేట కుళాయిచెరువు గట్టురోడ్డు, రంగమన్నారుపేట సెంటర్, కెనాల్ రోడ్డు దాసోహాంజనేయస్వామి, లజపతిరాయ్‌పేట, హౌసింగ్‌బోర్డు కాలని, రైల్వేగేటు సెంటర్, గజలక్ష్మి సెంటర్, మారుతి సెంటర్, బార్గవినగర్, వడలివాని పేట, డాంపేట, రామాలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం కొన్ని రామాలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శనివారం ర్యాలీ నిర్వహించిన ధర్మ పరిరక్షణా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో కల్యాణం జరుగుతున్న 40 రామాలయాల వద్దకు వెళ్లి స్వామివారికి పట్టు కండువా, అమ్మవారికి పసుపు, కుంకుమలు, పూజా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకన్న, మడ్డు వాసు, రేపాక ప్రవీణ్ భాను, శ్రీకాకొల్లు వెంకన్న తదితరులు పాల్గొన్నారు. 20వ వార్డు సలాదివారి తోటలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి కల్యాణం అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీలు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొరగంజల శ్రీను, పూర్ణ, హనుమంతు, రాంబాబు, చెన్ను విజయ్, గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, కర్పూరం వెంకటేశ్వరరావు, దేవరపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: శ్రీరామనవమి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. సీతారామ సమేత స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రసిద్ధ కుమ్మరివీధి రామాలయంలో వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటి ప్రతినిధులు కోటిపల్లి ఆనందరావు, కోటిపల్లి బ్రహ్మానందం, పాలంకి ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారపుపేట రామాలయం, పొన్నపల్లి రామాలయం, పాతబజార్ రామాలయంలో వేడుకలు నిర్వహించారు. పాత బజార్‌లోని శ్రీరామసాయిమందిర్‌లో వలవల సురేష్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. చిన మామిడిపల్లిలో ఓఎన్జీసీ రోడ్డు వద్ద వేడుకను ఘనంగా నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తిల్లపూడి, శివదేవుని చిక్కాల, దగ్గులూరు, బల్లిపాడు, కాపవరం, లంకలకోడేరు, వెలివెల, సగంచెరువు, పెదమామిడిపల్లి, వడ్లవానిపాలెం, వాలమర్రు, అరట్లకట్ట గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోరింటాడలో సీతారాముల కల్యాణాన్ని సొసైటీ అధ్యక్షుడు వర్ధినీడి విజయ శ్రీనివాస్ దంపతులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొని కల్యాణం నిర్వహించిన దంపతులను ఆశీర్వదించారు. సర్పంచ్ మండెల పావని, మండెల నాని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కాపవరంలో గౌడ రామాలయం, శెట్టిబలిజ రామాలయం, రాజుల రామాలయం వద్ద సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

నరసాపురం మండలంలో.

నరసాపురం రూరల్: శ్రీరామనవమి సందర్భంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల ఆలయాల వద్ద స్వామి వారి కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. కొప్పర్రు, సీతారామపురం, వేములదీవి, పసలదీవి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, దర్బరేవు, కె.బేతపూడి తదితర గ్రామాల్లోని రామాలయాల్లోని పండితుల వేద మంత్రాల నడుమ రాములవారి వివాహం వేడుకలను కన్నుపండువగా నిర్వహించారు.

మొగల్తూరులో..

నరసాపురం రూరల్: శ్రీరామనవమి సందర్భంగా గురువారం మండలంలోని అన్ని రామాయాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మొగల్తూరులోని పురాతన పెద్ద రామాలయంలో చోడిశెట్టి కృష్ణ సునీల్ హేమశ్రీ నికిత దంపతులు, పీడీఆర్ కాంప్లెక్స్ వద్ద బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో కారుమూరి మణిబాబు, కృష్ణవేణి దంపతులు, పేటపల్లంలో పట్నాల మహేష్, కనకమహాలక్ష్మీ దంపతులు, గునిశెట్టి నర్సింహమూర్తి వరలక్ష్మీ దంపతులు, మైలవరపు యువ కిరణ్ దంపతులచే కల్యాణోత్సవాన్ని ఉత్సవ కమిటీలు నిర్వహించాయి. సత్రవుపాలెం, కోట, పడమటిపాలెం, కుక్కలవారితోట, లాకుపల్లవపాలెం, గుంటపల్లవపాలెం, మసీదు సెంటర్‌తో పాటు రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం, ముత్యాలపల్లి, కాళీపట్నం, శేరేపాలెం గ్రామాల్లోనూ పలు కూడళ్లల్లో రాముల వారి కల్యాణాన్ని నిర్వహించారు. పలు కూడళ్ళు, ఆలయాల వద్ద కల్యాణం అనంతరం నిర్వహించిన అన్న సమారాధనల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పోడూరులో..

పోడూరు: మండలంలోని పెనుమదం గ్రామంలో తూర్పు వీధిలోని శ్రీ పట్టాభి రామాలయంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లు మురళి-పద్మావతి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం మహోత్సవాన్ని కనుల పండుగగా జరిపించారు. అర్చకులు నిట్టల కామేశ్వర శర్మ కల్యాణ వేడుకను జరిపించారు. కల్యాణ మహోత్సవ అనంతరం పానకం, వడపప్పు పంచిపెట్టారు. శ్రీ పట్టాభి రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెగ్గిపూడిలో రెడ్డి రామాలయం వద్ద నల్లిమిల్లి గౌతమ్ రంజిత్ కిషోరరెడ్డి – భాగ్యలక్ష్మి దంపతులు కల్యాణోత్సవాలను నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అదేవిధంగా పెనుమంట్ర, మార్టేరు, ఆలమూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

రామాలయానికి పంచలోహ విగ్రహాల సమర్పణ

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని శెట్టిబలిజ రామాలయానికి గ్రామానికి చెందిన గుబ్బల శ్రీను, సూర్యకళ దంపతులు సీతారాముల పంచలోహ ఉత్సవ విగ్రహాలు సమర్పించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో గురువారం జరిగిన కల్యాణంలో ఈ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల దాతలతో పాటు బొలిశెట్టి సుబ్రహ్మణ్యం, ఉమాంజలి లక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వీరిచేత ఆలయ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొని కొంత సమయం పల్లకీ మోశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

పెనుగొండ: శ్రీరామ నవమి వేడుకలు గురువారం వాడవాడలా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆచంట మండలం కొడమంచిలి బండివారిపాలెం శ్రీరామనవమి వేడుకల్లో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. పెనుగొండలో కంబాల వారి వీధి, రామచంద్రరావు పేట, జవ్వాదివారి వీధి, బజారు రామాలయం, లింగాల వీధి, బీళ్ల వారి రామాలయం, కొప్పిశెట్టివారి వీధి, చెరుకువాడ, కూరగాయల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో సంతమార్కెట్‌లోనూ, వడలి కమ్మవారి రామాలయం వద్ద, సిద్ధాంతం, ములపర్రు, ఇలపర్రు, చినమల్లం,దేవ, నడిపూడి, మునమర్రు, కొఠాలపర్రుల్లోనూ నిర్వహించారు. కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు.


సిద్ధాంతంలో రావిచెట్టు సెంటర్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వడలిలో రథోత్సవం

వడలి కమ్మవారి రామాలయంలో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి, రథోత్సవం నిర్వహించారు. ఆచంట మండలంలోనూ ఆచంట కాపులపాలెం, పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి వల్లూరు. కొడమంచిలి, కోడేరు, అయోధ్యలంకల్లోనూ సీతారాముల కల్యాణం నిర్వహించారు.


మొగల్తూరు బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు


పెనుమంట్ర మండలం నెగ్గిపూడిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


మన్యం జగ్గమ్మ సత్రం వద్ద సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న దృశ్యం


పెనుమదంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు చామకూరిపాలెంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ

నరసాపురం రూరల్: మండలంలోని చామకూరిపాలెం గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్ యాదవ్ గురువారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మండలంలోని పసలదీవి, చామకూరిపాలెం, ఎల్బీచర్ల, తూర్పుతాళ్లు, పీఎం లంక గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు ఆసరా సొమ్ము అందిస్తారని పేర్కొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు శుక్రవారం యలమంచిలి సెంటర్లోని తమ్మినీడి నరసింహారావు ఎస్టేట్‌లో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం మళ్ల సోని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. ఆసరాలో లబ్ధి పొందిన డ్వాక్రా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బీసీలకు అండగా సీఎం జగన్


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘాల నాయకులు

పెనుగొండ: రాష్ట్రంలో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి బండి వారి పాలెంలో రూ.10 లక్షలతో నిర్మాణం పూర్తిచేసిన శెట్టి బలిజ కమ్యూనిటీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. గత ప్రభుత్వాల్లో శంకుస్థాపనలు చేసి వదలేసిన శెట్టిబలిజ కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేశామన్నారు. బీసీలకు ఎంతో చేసాం అంటున్న గత పాలకులు ఒక సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కొడమంచిలి సొసైటీలో తొలిసారిగా బీసీలకు అధ్యక్ష పదవి కేటాయించామని పేర్కొన్నారు. గత పాలకులు ఏనాడైనా బీసీకు పదవిని కట్టబెట్టారా అంటూ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ అగ్రవర్ణ నిరుపేదల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల నుంచి ఏ నాయకుడు వచ్చినా పట్టించుకొన్న దాఖలాలు లేవన్నారు. బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు మెటల్, ఐరన్, సిమెంట్ బస్తాలుతో పాటు, సొంతంగా రూ.5 లక్షలు అందజేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక శెట్టి బలిజ సంఘ పెద్దలు,మహిళలు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం అధ్యక్షుడు బాలనాగు నరేష్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాక సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పుచ్చకాయల నాగార్జున, బొక్కా మల్లేశ్వరరావు, బొక్కా సుబ్బలక్ష్మి, కుసుమే నారాయన మూర్తి, నార్గన ఆదినారాయణ, గూడరి బాబు, బొక్కా కన్నారావు, చామంతి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షీరారామలింగేశ్వర స్వామి కల్యాణం


శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు గురువారం సాయంత్రం గణపతి పూజ, అంకురార్పణ, ధజారోహణ, అగ్నిప్రతిష్టాపన, బలిహరణతో ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 5.15 గంటలకు (తెల్లవారితే శనివారం) శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీసమేత శ్రీ జనార్దనస్వామివార్ల సప్తాహ్నిక కల్యాణం జరగనుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ సన్నాయి వాయిద్యాలతో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణమహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టుబోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రైతు సంక్షేమమే సొసైటీ లక్ష్యం


కొడమంచిలి సొసైటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సొసైటీ ముందుకు సాగుతుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. గురువారం కొడమంచిలి సొసైటీలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ కొడమంచిలి సొసైటీ 106 సంవత్సరాలు పూర్తి చేసుకొందన్నారు. సొసైటీలో షేర్ ధనం రూ.40,28,372 ఉండగా, సీసీ లోన్‌లు రూ.2,28,78,277లు, ఎల్ఎస్ లోన్‌లు రూ.46,37,620లు, ఏసీ లోన్‌లు రూ.12,74,000లు, ఎల్‌టీ లోన్‌లు రూ.72.34.259లు ఇచ్చినట్లు వివరించారు. సొసైటీలో రూ.1,17,35,661 డిపాజిట్లు, 2020–21 సంవత్సరానికి వడ్డీరాయితీ రూ.4,90,000 అందించగా, రైతు భరోసా కేంద్రం ద్వారా సార్వాకు రూ. 7 కోట్లు, దాళ్వాకు రూ.10 కోట్లు ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సహకరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మన్నే సుబ్బారావు, సాక సువర్ణరాజు, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, సొసైటీ కార్యదర్శి కాళ్లకూరి నాగేశ్వరరావు, రైతులు నెక్కంటి రమణ, బాలనాగు వెంకటాచాలం, తమ్మిన భాస్కరరావు, తమ్మిన చంద్రశేఖర్, పెచ్చెట్టి రంగారావు, తమ్మిన సత్యనారాయణ పాల్గొన్నారు.

లాభాల బాటలో మృత్యుంజయ కో ఆపరేటివ్ బ్యాంక్

రైతు సంక్షేమమే పరమావధిగా ఆచంట మృత్యుంజయ కో ఆపరేటివ్ బాంకును లాభాల బాటలో ముందుకు తీసుకువెళ్తున్నట్లు బ్యాంక్ ఛైర్ పర్సన్ వైట్ల శారదాదేవి సొసైటీ ఆవరణలో జరిగిన మహాజన సభలో అన్నారు. గతంలో అందించిన సేవలను మరింతగా విస్తృత పరిచి రెండింతలుగా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. గతంలో రూ.12కోట్లు రుణాలు ఇవ్వగా, ఇపుడు రూ.24 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా డిపాజిట్లు దారులు పెరిగారన్నారు. త్వరలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రత్యేక స్కీంలో రూ.10 కోట్లు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులుపె చ్చెట్టి సత్యనారాయణ, మెండే శ్రీనివాస్, కార్యదర్శి పారుపల్లి ఏసురత్నం, వైట్ల కిషోర్ కుమార్, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, తమ్మినీడి ప్రసాద్, నెక్కంటి సతీష్, కానుమిల్లి జోగిరాజు, నెక్కంటి ప్రభాకరరావు, గొడవర్తి చంద్రశేఖర్, మనవర్తి విజయ్‌కుమారి, ఎంపీటీసీలు ఉల్లం జ్యోతిరామనుజం, తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, నెక్కంటి రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో ద్విచక్ర వాహనాలకు అనుమతి

నరసాపురం: పట్టణంలోని 30వవార్డు రైల్వే స్టేషన్ రోడ్డులో రూ 1.40 కోట్లు నిధులతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ మార్గంలో నిలుపుదల చేసిన వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి సరిపల్లి మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఫోర్ వీలర్స్‌కు మరో రెండు రోజుల్లో అనుమతి ఇస్తారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి గ్రేస్ నగర్ వరకూ వరకూ సాగుతున్న రోడ్డు పనులు కారణంగా గత 20 రోజులుగా ప్రజలు చుట్టుతిరిగి ప్రయాణించాల్సి వస్తోంది.

నేడు ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

యలమంచిలి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై తనిఖీ చేసి ఆ నివేదికను చదివి వినిపించేందుకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 32 గ్రామాలలో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకూ చేసిన పనులను తనిఖీ బృందం ఈ నెల 19 నుంచి 30 వరకు పరిశీలించిందన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి విషయాలు చెప్పారన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో కూడా ప్రజావేదిక నిర్వహిస్తునట్లు ఆయన వివరించారు.

కొట్టి గాయపరిచారని వ్యక్తి ఫిర్యాదు

సాక్షి, భీమవరం: మండలంలోని బలుసుమూడిలోని ఒక అపార్ట్‌మెంట్ ఆవరణలో మోటార్ సైకిల్ పార్కింగ్ చేస్తుండగా అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు కొట్టి గాయపరిచారని బి.ఉదయ్ కిరణ్ ఫిర్యాదు చేశారని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని గరగపర్రులో కోడిపందాల స్థావరంపై ఎస్సై ఎస్.శ్రీనివాసరావు గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి ఒక కోడి కత్తి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.